నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, సోమవారం 20 జనవరి 2025 | YADADRI BHUVANAGIRI



నల్లగొండలో మంగళవారం నిర్వహించనున్న బీఆర్ఎస్ రైతు మహాధర్నా సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

# డ్రోన్ వైద్య సేవలు సూపర్

## ఎయిమ్స్ డ్రోన్ ప్రాజెక్ట్ విజయవంతం



అడ్డగూడూరు మండలం గట్టు సింగారం నుంచి ప్రభుత్వ దవాఖానకు డ్రోన్ సహాయంతో నమూనాలను పంపిస్తున్న వైద్యులు (ఫైల్)

- మారుమూల ప్రాంతాల నుంచి నమూనాలు సేకరణ
- నిమిషాల వ్యవధిలోనే దవాఖానలకు చేరవేత
- అత్యవసర సమయాల్లో మందులు కూడా..
- తొలుత జిల్లాలోని కొన్ని చోట్లకే పరిమితం
- ప్రస్తుతం అన్ని ప్రాంతాలకు సేవల విస్తరణ
- ఇప్పటి వరకు 1200 శాంపిల్స్ రవాణా

బీబీనగర్ ఎయిమ్స్ డ్రోన్ ప్రాజెక్ట్ సక్సెస్ అయ్యింది. తెలంగాణలోనే తొలిసారిగా తీసుకొచ్చిన డ్రోన్ సేవలు విజయవంతం అయ్యాయి. ట్రయల్ రన్ ఫలప్రదం కావడంతో సర్వీసులను విస్తరించారు. జిల్లాలో తొలుత పలు పీహెచ్‌సీలలో అమలు చేయగా.. ఇప్పుడు అన్ని చోట్లా సేవలు అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల నుంచి 1200 నమూనాలను ఆస్పత్రులకు చేరవేశారు. అంతేకాకుండా అత్యవసర సమయాల్లో మందులు కూడా సరఫరా చేశారు.

– యాదాద్రి భువనగిరి, జనవరి 20 (నమస్తే తెలంగాణ)

సాంకేతికంగా ప్రపంచం దూసుకుపోతున్నది. టెక్నాలజీ పరంగా అద్భుతాలు ఆవిష్కృతమవుతున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్సెస్ రంగాల్లో మనిషి రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాడు. అయితే ఈ టెక్నాలజీని ఆరోగ్య రంగంలో మిక్స్ చేసి.. అద్భుతాలు సృష్టించేందుకు ఎయిమ్స్ శ్రీకారం చుట్టింది. డ్రోన్ల ద్వారా ఆరోగ్య, సేవల రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చే దిశగా అడుగులు వేసింది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ జిల్లాలో జాతీయ టీబీ నిర్మూలన కార్యక్రమం కింద కఫం నమూనాలు, ఇతర మందుల రవాణాలో వినియోగంలో సాధ్యాసాధ్యాల అధ్యయనంపై ఎయిమ్స్‌కు డ్రోన్ ప్రాజెక్ట్‌ను మంజూరు చేసింది. 2023 డిసెంబర్ 14 నుంచి డ్రోన్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం కలెక్టర్, డీఎంహెచ్ఓ, డీజీపీ, సివిల్ ఏవియేషన్ మంత్రిత్వ శాఖ అనుమతులు తీసుకున్నారు. మొదటగా వివిధ ప్రాంతాలకు ట్రయల్ రన్ నిర్వహించారు.

### జిల్లా అంతటా సేవల విస్తరణ..

ట్రయల్ రన్ పూర్తి కావడంతో గతేడాది జనవరి నుంచి రెగ్యులర్‌గా సేవలు కొగసాగిస్తూ వస్తున్నారు. అయితే తొలుత పరిమిత సంఖ్యలో పీహెచ్‌సీ, సబ్ సెంటర్లకు అనుసంధానించారు. బొల్లెపల్లి, కొండమడుగు బొమ్మలరామారం పీహెచ్‌సీలు, మర్యాల, నందనం సబ్ సెంటర్లకు భువనగిరి ట్యూబర్‌కోలసిస్ యూనిట్‌కు, వర్కట్‌పల్లి, మునిపంపుల పీహెచ్‌సీలను రామన్నపేట యూనిట్‌కు అటాచ్ చేశారు. ఆయా చోట్ల సేవలు విజయవంతం కావడంతో గతేడాది అక్టోబర్ 30న ప్రధాని మోదీ వర్చువల్‌గా డ్రోన్ సేవలను ప్రారంభించారు. అనంతరం జిల్లా అంతటా సేవలను విస్తరించారు. నిత్యం ఎక్కడో ఓ ప్రాంతానికి డ్రోన్‌ను పంపించి సేవలు అందిస్తున్నారు.

### 1200 నమూనాల చేరవేత..

గిరిజన, కొండ ప్రాంతాల్లో మెరుగైన, సత్వర సేవలు అందించడమే లక్ష్యంగా డ్రోన్ సేవలను అందుబాటులోకి తెచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలకు సిబ్బంది వెళ్లి రక్త నమూనాలు తీసుకువచ్చేందుకు ఎక్కువ సమయం పడుతుంది. ఇకపై ఆ అవసరం లేకుండా డ్రోన్‌లో ఇంజక్షన్లను వైద్యులకు పంపిస్తున్నారు. నిమిషాల వ్యవధిలోనే శాంపిల్స్‌ను చేరవేస్తున్నారు. అతి తక్కువ సమయంలో రోగ నిర్ధారణ చేసి, అవసరమైతే తిరిగి మందులను కూడా డ్రోన్‌లో పంపిస్తున్నారు. దీని వల్ల సమయం, మానవ వనరులతో డబ్బులు ఆదా అవుతున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 1200 నమూనాలను చేరవేశారు.

### రెండు డ్రోన్లు, ముగ్గురు పైలెట్లు..

ప్రస్తుతం ముగ్గురు పైలట్లు, రెండు డ్రోన్‌లను నడుపుతున్నారు. ఒకటి 8 కిలోల సామర్థ్యంతో, మరొకటి 15 కిలోలతో సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. ఒక్కో డ్రోన్ దాదాపు 60-70 కిలోమీటర్ల పరిధిని కలిగి ఉంది. ఆ తర్వాత బ్యాటరీలను రీచార్జి చేయాల్సి ఉంటుంది. అంతే కాకుండా జిల్లా నుంచి పలువురు ఆశ వర్కర్లకు డ్రోన్లపై శిక్షణ ఇచ్చారు. వీరు డ్రోన్లను ఆపరేట్ చేయడంలో సహకరిస్తున్నారు. డ్రోన్లతో నిమిషాల వ్యవధిలోనే నమూనాలను చేరవేస్తున్నారు. ఇటీవల అడ్డగూడూరు మండలంలోని గట్టుసింగారంలో టీబీ రోగుల నుంచి శాంపిళ్లను సేకరించి రామన్నపేట ప్రభుత్వ దవాఖానకు డ్రోన్ సహాయంతో పంపించారు. అడ్డగూడూరు నుంచి రామన్నపేటకు 53 కిలోమీటర్ల దూరం ఉండగా, వాహనంతో పంపిస్తే ఒక గంట 20 నిమిషాలు పడుతుంది. అదే డ్రోన్‌తో 30 నిమిషాల సమయం మాత్రమే తీసుకుంది.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

# హామీల అమలులో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

- రైతు రుణమాఫీ సగం మందికి కూడా కాలేదు
- రేషన్ కార్డుల్లో కోత విధిస్తే ఊరుకునేది లేదు
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి
- ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

గుండాల, జనవరి 19 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కోతలు విధిస్తే ఊరుకునేది లేదని ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. గుండాల మండలంలోని వస్తాకొండూర్ గ్రామంలో ఆదివారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అనేక హామీలు ఇచ్చి ఏ ఒక్కటి కూడా అమలు చేయడం లేదని, రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసిందని అన్నారు. రుణమాఫీ విషయంలో ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడే పరిస్థితులు వచ్చాయని విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకుండా రైతులను నిండా ముంచారని అన్నారు. నేడు గ్రామాల్లో సంక్షేమ పథకాల పేరుతో సర్వే చేస్తున్నారని, రేషన్ కార్డుల్లో భారీగా కోత విధిస్తున్నారని, ప్రభుత్వం ఎటువంటి నిబంధనలు చెప్పకుండా అన్యాయంగా రేషన్ కార్డులు ఇవ్వకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లోని ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రభుత్వం సర్వే చేస్తున్నట్లు చెప్పారు. పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వరం మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పిట్టల పూర్ణచందర్, కోలుకొండ రాములు, పాలబిందెల రాములు, కాశయ్య, గోపాల్‌దాస్ వెంకన్న, జటంగి రాజు, అట్ల రంజిత్‌రెడ్డి, బొమ్మిరెడ్డి మల్లారెడ్డి, వీరమల్ల సోమన్న, అన్నెపర్తి భిక్షం, కారుపోతుల సాయికుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

# రాష్ట్రాన్ని విధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- దివాలా తీయిస్తున్నది రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్కనే
- రాజకీయాలకతీతంగా స్వచ్ఛందంగా మహాధర్నాకు తరలిరావాలి
- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్, జనవరి 19 : రాష్ట్రాన్ని దివాలా తీయించిన వారే విమర్శిస్తున్నారన్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాటలకు నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఘాటుగా బదులిచ్చారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేస్తున్నదని కాంగ్రెస్ ప్రభుత్వమేనని, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలే దివాలా తీయిస్తున్నారని అన్నారు. 18 గంటల ఎక్కడ పనిచేసేది ప్రజలను దోచుకునేందుకేనని, కమీషన్లకు కక్కుర్తి పడుతూ ఢిల్లీకి ముడుపులు కడుతున్నారని మండిపడ్డారు. నల్లగొండలో ఈ నెల 21 న నిర్వహించనున్న రైతు మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ ఆదివారం నకిరేకల్ బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఊరిలో వైకుంఠధామం, రైతు వేదిక, కాళేశ్వరం ప్రాజెక్టు, రూ.వెయ్యి కోట్లతో యాదగిరి గుట్ట లక్ష్మీనర్సింహస్వామి దేవాలయం, సెక్రటేరియట్,ఎమ్మెల్యే క్వార్టర్స్ కట్టింది కేసీఆర్ కాదా?.. పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటుచేసింది, పింఛన్లు పెంచింది కేసీఆర్ కాదా?.. ఇందులో కేసీఆర్ ఎక్కడ విధ్వంసం చేశారో ఆయన చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అయినా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నియోజకవర్గంలో కేసీఆర్ పుణ్యమా అని ఒక మండలానికి దళిత బంధు ఇచ్చామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి సంవత్సరవుతున్నా ఎన్ని మండలాలకు దళిత బంధు ఇచ్చావని? ఎంత మంది రైతులకు రైతుబంధు ఇచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. కొడంగల్ ఎంతమందికి రుణమాఫీ చేశారో సర్వే చేద్దామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారని, ఆ సవాల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి గానీ, డిప్యూటీ సీఎం భట్టిలు స్వీకరించలేకపోతున్నారని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అక్రమ నిర్బంధాలు, కేసులు పెట్టడమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిగా పెట్టుకుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటై అదానీ కనుసైగల్లో ఈ రాష్ట్రాన్ని రేవంత్‌రెడ్డి సర్వనాశనం చేస్తున్నారనేది స్పష్టంగా కనబడుతుందని చెప్పారు. ప్రజాపాలనలో రేషన్ కార్డుల కోసం వేల దరఖాస్తులు చేసుకున్నారని, వాటిని పరిగణలోకి తీసుకోకుండా కులగణన ద్వారా సర్వే చేయించి వందల్లో రేషన్ కార్డులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఇలాంటి డ్రామాలు ఆడుతున్నారన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు కొప్పుల ప్రదీప్‌రెడ్డి, సోమ యాదగిరి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, మారం వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నోముల కేశవరాజు, బీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిలువేరు ప్రభాకర్, మాజీ ఎంపీటీసీలు గుర్రం గణేశ్, నాయకులు వీర్లపాటి రమేశ్, సామ శ్రీనివాస్‌రెడ్డి, గొర్ల వీరయ్య, యానాల లింగారెడ్డి, చందర్‌రావు, పేర్ల కృష్ణకాంత్ పాల్గొన్నారు.

# పండుగ ముగిసినా తప్పని అదనపు బాదుడు

- ఈ నెల 18 వరకే ఆర్టీసీలో 50 శాతం పెంచిన చార్జీలు వసూలు
- నల్లగొండలో ప్రయాణికుల ఆందోళన





నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు ఇద్దరికి కలిపి రూ. 500 వేసిన టికెట్

నల్లగొండ సిటీ జనవరి 19 : సంక్రాంతి పండుగ ముగిసినా ఆర్టీసీ టికెట్లపై అదనపు బాదుడు తగ్గలేదు. పండుగ సందర్భంగా అదనపు బస్సుల పేరుతో ఆర్టీసీ ప్రయాణికుల నుంచి టికెట్‌పై 50 శాతం చార్జీలను పెంచింది. అదే దోపిడీ పండుగ ముగిసినా కొనసాగిస్తుండడంతో ఆదివారం నల్లగొండ బస్టాండ్‌లో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులపై ఘర్షణకు దిగారు. సాధారణ రోజుల్లో నల్లగొండ నుంచి హైదరాబాద్‌కు డీలక్స్‌లో రూ.180 ఉండగా పండగ సందర్భంగా రూ. 250 వసూలు చేశారు. ఈ నెల 18 వరకు మాత్రమే ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలు వసూలు చేయాలని. కానీ పండుగ ముగిసినా అవే చార్జీలు వసూలు చేస్తున్నారు. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులు చార్జీలను తగ్గించడం లేదని తెలుస్తున్నది. దీనిపై కొందరు ఆర్టీసీ అధికారులను ప్రశ్నిస్తుండగా, గత్యంతరం లేక మరికొందరు అవే బస్సుల్లో వెళ్తున్న పరిస్థితి కనిపించింది.

### 23, 24 తేదీల్లో రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీస్ సెలక్షన్ ట్రయల్స్

నల్లగొండ రూరల్, జనవరి 19: భారత ప్రభుత్వం నిర్వహించే ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ టోర్నమెంట్‌లో భాగంగా రాష్ట్ర స్థాయి సెలక్షన్ ట్రయల్స్ కోసం ఈ నెల 23, 24 తేదీల్లో ఎంపిక నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల, యువజన శాఖ అధికారి కుంభం నర్సిరెడ్డి అదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెట్స్, క్రికెట్, ఖోఖో, యోగా, చెస్, క్యారమ్, హాకీ, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, బెస్ట్ ఫిజిక్, రెజ్లింగ్ అండ్ గ్రీకో రోమన్ క్రీడల్లో ఎంపిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఈనెల 21న ఉదయం 10 గంటలకు జిల్లా క్రీడా శాఖ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. వివరాలకు 94400 72854 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

# ప్రశ్నిస్తే దాడులు.. పాలన చేతగాక డైవర్షన్ పాలిటిక్స్

- ఏడాదైనా అమలు కాని కాంగ్రెస్ హామీలు
- రేపు నల్లగొండలో బీఆర్ఎస్ రైతు మహా ధర్నాను విజయవంతం చేయాలి
- తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

మోత్కూరు, జనవరి19 : అడ్డగోలు హామీలిచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. మోత్కూరులో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్నారని, హామీలు అమలు చేతగాక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ కార్యాలయాలపై దాడులు చేస్తున్నారని, అక్రమ కేసులు పెడుతున్నారని తెలిపారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15వేలు, అసరా పెన్షన్ నెలకు రూ.4వేలు ఇస్తామని మాట తప్పారని విమర్శించారు. రుణమాఫీ అంతా బోగస్ అని, రైతు పండుగ పేరుతో రూ.2,700 కోట్ల చెక్కు ఇచ్చి పైసా జమ చేయకుండా మోసం చేశారని అన్నారు. క్యాబినెట్‌లో ఆరు మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయని, వాటిని భర్తీ చేసే దమ్ము కాంగ్రెస్ లేదని చెప్పారు. 28 సార్లు ఢిల్లీకి పోయి ఖాళీ చేతులతో వచ్చి రేవంత్‌రెడ్డి సీఎం గౌరవాన్ని తాకట్టు పెట్టారని తెలిపారు. రాష్ట్రంలో విద్య, వైద్యం, వ్యవసాయం, విద్యుత్ వ్యవస్థ కుంటుపడిందని, ఏడాది గడిచినా ప్రజలకు ఉపయోగపడే ఒక్క పని కూడా రేవంత్ సర్కారు చేయలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అంటేనే మోసం, దగా అని ప్రజలకు ఇప్పటికే అర్థమైందని, రానున్న రోజుల్లో కాంగ్రెస్‌పై తిరుగబడుతారని చెప్పారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగే రైతు మహాధర్నాకు ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేవూరి ధర్మేందర్‌రెడ్డి, నార్మాక్స్ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు తీపిరెడ్డి మేఘారెడ్డి, చిప్పలపల్లి మహేంద్రనాథ్, కొణతం యాకూబ్‌రెడ్డి, మోత్కూరు, అడ్డగూడూరు మండలాల బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పొన్నెబోయిన రమేశ్, కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, జంగ శ్రీను, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీశ్, మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మి, నాయకులు గజ్జి మల్లేశ్, కొండ సోంమల్లు, శైలజ, ఇంద్రజ్యోతి, పురుగుల మల్లయ్య, రఘునందన్‌రెడ్డి పాల్గొన్నారు.



నల్లగొండ క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

# మాట తప్పిన కాంగ్రెస్‌ను నిలదీయాలి

- రేపటి మహాధర్నాకు పెద్దఎత్తున తరలి రావాలి
- నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ, జనవరి 19 : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, నల్లగొండలో మంగళవారం నిర్వహించే మహాధర్నాకు పెద్ద ఎత్తున హాజరై ప్రభుత్వాన్ని నిలదీయాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండలోని తన నివాస క్యాంపు కార్యాలయంలో ఆదివారం మహాధర్నా సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రైతు రుణమాఫీ చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన రేవంత్ సర్కార్ ఇప్పటి వరకు 30 శాతం మందికి మాత్రమే చేసింద న్నారు. ఎన్నికల్లో రైతు భరోసా పేరుతో ఎకరాకు ఏడాదికి రూ.15వేలు ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వకుండా మోసం చేసిందని, ఇప్పుడు మాట మార్చి రూ.12వేలు మాత్రమే ఇస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. ఏడాది కాలంలో కొత్త రైతులకు బ్యాంకుల్లో రుణం రావడం లేదని, మార్కెట్లో ఎరువులు కూడా లేవని అన్నారు. అనంతరం ఆయన వన్‌టౌన్, టూ టౌన్ సీఐలతో కలిసి సభ ఏర్పాట్లను క్లాక్ టవర్ సెంటర్‌లో పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నేతలు కటికం సత్తయ్య గౌడ్, చీర పంకజ్ యాదవ్, బొర్ర సుధాకర్, మందడి సైదిరెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, వంగాల సహదేవ్ రెడ్డి, కరీం పాష, నారబోయిన భిక్షం, లొడంగి గోవర్ధన్, బోనగిరి దేవేందర్, పల్‌రెడ్డి రవీందర్ రెడ్డి, దేప వెంకట్ రెడ్డి, ఐతగోని యాదయ్య, మారగోని గణేశ్, కొండూరు సత్యనారాయణ, జమాల్ ఖాద్రి, మెరుగు గోపి, జనార్దన్ రావు, వీరాచారి, శ్రీనివాస్, దొడ్డి రమేశ్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సగం మందికే సన్నాల బోనస్..!



- సీజన్ పూర్తయినా రైతులకు అందని వైనం
- సూర్యాపేట జిల్లాలో 1.18 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం కొనుగోలు
- రైతులకు రావాల్సింది రూ.59 కోట్లు.. వచ్చింది రూ.23 కోట్లే..

సూర్యాపేట, జనవరి 19 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం సన్న వడ్లకు ఇస్తామన్న బోనస్ సూర్యాపేట జిల్లాలో సగం కూడా పూర్తి కాలేదు. అన్ని పంటలకు బోనస్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రచారాల్లో ఊదరగొట్టి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత సన్న ధాన్యానికి మాత్రమే ఇస్తామని నాలుక మడతేసిన విషయం తెలిసిందే. ఇప్పటికే రుణమాఫీ పూర్తి చేయకపోవడం, రెండు సీజన్లుగా రైతుబంధు ఇవ్వకపోగా సన్నాలకు పూర్తి స్థాయి బోనస్ రాకపోవడంతో రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. జిల్లాలో 1.18 లక్షల మెట్రిక్ టన్నుల సన్న వడ్లు పండించగా రైతులకు రూ.59 కోట్లు బోనస్ రావాలి. కానీ ఇప్పటి వరకు సుమారు రూ.23 కోట్లు రాగా ఇంకా రూ.36 కోట్లు పెండింగ్‌లో ఉంది.

### ఎక్కువ మొత్తంలో పండింది దొడ్డు ధాన్యమే..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల సంగతి అటుంచితే, గతంలో కేసీఆర్ అమలు చేసిన పథకాలు కూడా కొనసాగడం లేదు. రైతు భరోసా ఎకరానికి ఏడాదికి రూ.15,000 ఇస్తామని చెప్పగా గత రెండు సీజన్లుగా ఆ ఊసే ఎత్తడం లేదు. రూ.రెండు లక్షల లోపు రుణమాఫీ చేస్తామని 40 శాతం కూడా పూర్తి చేయలేదు. రైతులకు నీటి కష్టాలు వర్ణనాతీతం. వీటితో పాటు ఎన్నికల ముందు రైతులు పండించే ప్రతి పంటకు బోనస్ ఇస్తామని వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుక మడతేసింది. వడ్ల విషయానికి వస్తే 80శాతం మంది రైతులు ప్రైవేట్ మార్కెట్‌లో విక్రయించుకునే సన్నాలకు మాత్రమే ఇస్తామని ప్రకటించింది. సూర్యాపేట జిల్లాలో 4,72,000 ఎకరాల్లో వరి సాగు కాగా అందులో 3,79,000 ఎకరాల్లో సన్న రకం ఉన్నది. కేవలం 93 వేల ఎకరాల్లో మాత్రమే దొడ్డు రకం సాగు అయినట్లు అధికారిక లెక్కలు ఉన్నాయి. సన్న వడ్లు పండించిన అత్యధిక శాతం రైతులు తమ ధాన్యాన్ని నేరుగా ప్రైవేట్‌లో విక్రయించుకోగా 20శాతం ధాన్యం మాత్రమే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించారు. కాని వారికి రావాల్సిన బోనస్ సగమే వచ్చింది. వానకాలం సీజన్ పూర్తయి వడ్లన్నీ అమ్ముకొని, యాసంగికి సంబంధించిన నాట్లు కూడా దగ్గర పడగా ఇప్పటి వరకు సగం కూడా బోనస్ రైతులకు అందకపోవడం గమనార్హం. ఇచ్చిన హామీలు అమలులో కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ సన్న వడ్లకు బోనస్ ఇస్తుందా లేదా అన్న సందేహం రైతుల్లో నెలకొన్నది.

### వడ్ల బోనస్ కోసం ఎదురుచూస్తున్నా



సన్న వడ్ల కాంటాలు వేసి రెండు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం ఇస్తామన్న 500 బోనస్ రావడం లేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో మావి 157 బస్తాలు కాంటాలు వేశారు. బోనస్ డబ్బులు అడిగితే మాకు తెలియదని అధికారులు సమాధానం చెబుతున్నారు. ఏం చేయాలో తెలియడం లేదు. ఇప్పటి వరకు రైతు బంధు కూడా రాలేదు. కాంగ్రెస్ పాలనలో ప్రజలు, రైతులు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

-హలవత్ వీర్య, రామునితండా, సర్వారం, మోతె